సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



మధ్యాహ్న భోజనం చేసిన సబ్ కలెక్టర్

కలికిరిలోని మహాత్మా జ్యోతిరావు పూలె వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మధ్యాహ్న భోజనం చేశారు. - 8లో



మర్రిబండలో చిరుత కలకలం?

నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ మర్రిబండ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం గ్రామస్తుల్లో కలకలం రేపింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 902 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	480
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1243.480 కిలోలు

న్యూస్‌రీల్

4న జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్టు ఎంపిక



రాయచోటి (జగదాంబసెంటర్): ఈ నెల 17, 18, 19 తేదీలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు ఉమ్మడి కడప జిల్లా బాల బాలికల జట్టును ఎంపిక చేయనున్నారు. ఈనెల 4న రాయచోటిలోని మాసాపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జేసునాథరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సెలెక్షన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వరయ్య, మనోహర్ రెడ్డి తెలిపారు. 2007వ సంవత్సరం జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి మిరప సాగుపై శిక్షణ

మైదుకూరు: మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్ర, శనివారాల్లో మిరప పంట సాగుపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మిరప సాగు యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని మిరప రైతులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్డీగా డాక్టర్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



ఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 ఇన్‌చార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ వై. శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉద్యోగుల ప్రయోజనాల కోసం చర్యలు చేపడుతామని అన్నారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటిండెంట్ గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, వనీష, రవి, చంద్ర, కరుణాకర్, విశాల్, రాజశేఖర్ తదితరులు ఆర్డీకి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: అన్ని జిల్లాలలో మున్సిపల్, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఇతర అన్ని క్యాడర్ల ఖాళీలను ప్రమోషన్ల ద్వారా వెంటనే భర్తీ చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రతి నెలా ప్రమోషన్లు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కల్పించాలన్నారు.

కేసీ కెనాల్‌కు నీరు విడుదల



ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

వల్లూరు: ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నుంచి కేసీ కెనాల్‌కు గురువారం నీరు విడుదల చేశారు. అర్చకుల పూజల అనంతరం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి గేట్లు ఎత్తి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ కేసీ కెనాల్‌కు ఆగస్టు 1 వ తేదీనే నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రతి ఎకరాలకు నీటిని అందించాలనేదే సీఎం ధ్యేయమని అన్నారు. ఈ కాలువ ద్వారా కమలాపురం నియోజకవర్గంలో 9 వేల ఎకరాలకు, కడప నియోజకవర్గంలో 4,800 ఎకరాలకు, దేవుని కడప చెరువుకు నీరు అందుతుందని ఆయన అన్నారు.

చెయ్యేరును.. తోడేస్తున్నారు!

- అడ్డగోలుగా ఇసుక తరలింపు
- 'చెయ్యేరు'లో రెవెన్యూ నిఘా వైఫల్యం
- కూటమి నేతల వత్తిడికి తలొగ్గి..
- కంటి తుడుపుగా కేసుల నమోదు



చెయ్యేరు నదీపరీవాహక గ్రామమైన నారాయణనెల్లూరులో ఇసుక అక్రమంగా తోడేసి తరలిస్తున్న దృశ్యం

రాజంపేట: పచ్చనేతలు ఇసుకను యథేచ్ఛగా మేసేందుకు.. సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన 'ఉచిత ఇసుక విధానం' ఊతమవుతోంది. వర్షాకాల అవసరాలను గమనంలో ఉంచుకున్న వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రాశులుగా నిల్వ చేసిన ఇసుక ఇప్పటికే మూడొంతులకు పైగా టీడీపీ కూటమి నేతల పరమైంది. ఎక్కడికక్కడ ఎవరు పడితే వారు అందినంత దోచుకుని ఇప్పటికే రూ.కోట్లకు పడగలెత్తగా.. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం పరిధిలోని చెయ్యేరులో మరింత విజృంభించి..ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. బాధిత గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

వత్తిడితో..వెనుదిరిగి..

తాజాగా మంగళవారం నారాయణ నెల్లూరు గ్రామస్తులు ఇసుక అక్రమ రవాణా తాకిడి తట్టుకోలేక ఎస్ఈబీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే పోలీసులు వచ్చి బెస్తపల్లెలో కాపు కాసి ఆపై అధికారపార్టీ నేతల వత్తిడితో తిరుగు పయనమైనట్లు తెలుస్తోంది. కాగా చెయ్యేరులో నుంచి ఇసుక తరలించి గట్టులోనే అటవీ సమీపంలోకి డంపింగ్ చేసుకుని అక్కడి నుంచి జేసీబీలు పెట్టి టిప్పర్లకు ఎత్తుతున్నారని తెలుస్తోంది. పోలీసులు కేవలం కంటి తుడుపు చర్యగా ఒకటి, లేదా రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారి వివరణ కోరే ప్రయత్నం చేస్తే ఆయన అందుబాటులోకి రాలేదు.

నదిపేరు: చెయ్యేరు
విస్తరించిన మండలాలు: రాజంపేట, పెనగలూరు, నందలూరు
ఇసుక ట్రాక్టర్లు : 1000 ట్రిప్పులకుపైగా
తరలింపు ఇసుక: వేలాది క్యూబిక్‌మీటర్లకుపైగా..
ప్రధాన అక్రమ రవాణా: నారాయణనెల్లూరు, మందరం, అత్తిరాల

చెయ్యేరులో రెండేళ్లుగా యథేచ్ఛగా నీటి ప్రవాహం కొనసాగింది. దీంతో చెయ్యేరు ఇసుక మయంగా మారింది. అధికారిక క్వారీలు ఎత్తివేయడంతో ఇసుక డిమాండ్ పెరిగిపోయింది. చెయ్యేరులో రాత్రి పగలు అనే తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇసుక డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ట్రాక్టరు రూ.5,000 చొప్పున ఇసుక రవాణా చేస్తున్నారు. నందలూరు, రాజంపేట, పెనగలూరు మండలాల పరిధిలో విస్తరించి ఉన్న యేటి వారంబడి అనుకూల

▶▶రాత్రీ.. పగలు తేడా లేకుండా..


తను బట్టి ఇసుక వాహనాన్ని రోడ్డు ఎక్కిస్తున్నారు.రాజంపేట-నెల్లూరు రహదారిలోని నారాయణ నెల్లూరు, మందరం, అత్తిరాల ప్రాంతాల్లో ఇసుక ట్రాక్టర్ల రద్దీతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. హైవేలో నుంచి రైల్వేకోడూరు, రాయచోటి ,ఇటు కడప-రేణిగుంట హైవే మీదుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది.



చెయ్యేరులో రాత్రివేళలో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

ఎంపీలు వర్సెస్ రైల్వే!

- ఎంపీలతో రైల్వే సమావేశాలు కనుమరుగు
- బడ్జెట్ ముందు ప్రతిపాదనల సేకరణ కరువు
- రైల్వే అధికారుల ఇష్టానుసారమే ప్రతిపాదనలు
- రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్న దృష్టికి సమస్య
- ఆగస్టు 19, 20వ తేదీలలో జోనల్ లెవల్‌లో ఎంపీలతో మీటింగ్ నిర్వహించే అవకాశం



రాజంపేట: ఎంపీలు తమ నియోజకవర్గాల పరిధిలో రైల్వేశాఖ పరంగా అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి దక్షిణమధ్య రైల్వేకి చెప్పుకోవడానికి వీలులేని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. ఎంపీలు, రైల్వేశాఖ మధ్య సత్సంబంధాలు లేవన్నట్లుగా విమర్శలు వినపడుతున్నాయి. దీంతో ఎంపీల పట్ల రైల్వేశాఖ వ్యవహరిస్తున్న తీరుతో విసిగివేసారి ఉన్నారు. వారు ఇచ్చిన సమస్యలకు పరిష్కారం కనిపించని దాఖలాలు లేవు. హాల్టింగ్, నిధుల కేటాయింపు, కొత్త రైళ్ల ప్రతిపాదనలు రైల్వేజోనల్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎంపీలు అసంతృప్తిగా ఉన్నారు. ప్రతిపాదనలు తీసుకోవడమే కానీఅవి మంజూరు చేసే విషయం మాత్రం ప్రశ్నార్థకంగానే మారింది. ఉన్నతాధికారులు ఎంపీలతో పనిలేకుండా రైల్వేపరమైన అభివృద్ధికి ప్రతిపాదనలు చేసుకుంటూ పోవడంపై పెదవి విరుస్తున్నారు. ఇందులో అధికారపార్టీ ఎంపీలకు వెసులుబాటు కల్పించడంలో రైల్వే ఉత్సాహం చూపుతోందన్న విమర్శలున్నాయి.

ఎంపీల నుంచి ప్రతిపాదనల స్వీకరణేదీ?

కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆయా ప్రాంతాల ఎంపీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాల్సి ఉంటుంది. ఈ సారి అలాంటిదేమీ జరగలేదు. కొన్ని సంవత్సరాలుగా ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి. ఈ యేడాది ఎన్‌డీయే సర్కారు మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నుంచి కూటమికి చెందిన వారే అధికంగా ఉన్నారు. లోక్‌సభ ఎంపీలతో పాటు రాజ్యసభ సభ్యులు కూడా ఉన్నారు. ఎంపీలు తమ ప్రాంత రైల్వే సమస్యలపై వ్యక్తిగతంగా లేఖలు ఎంఆర్‌కు, ఎంఎస్ఆర్, రైల్వేబోర్డు చైర్మన్‌లకు ఇవ్వడం జరిగివుంటుందేమో కానీ , ఎంపీలతో రైల్వేశాఖ ప్రత్యేక సమావేశం పెట్టి వారి నుంచి ప్రతిపాదనలు స్వీకరించలేదు.

ఎంఎస్ఆర్ సోమన్న దృష్టికి సమస్య

రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్న దృష్టికి ఎంపీలతో జోనల్ స్థాయిలో అధికారులు సమావేశాలు ఏర్పాటు చేయడం లేదన్న అంశం వెళ్లింది. ఎంపీలతో సమావేశం నిర్వహించుకొని తద్వారా వారి వారి నియోజకవర్గాల పరిధిలో రైల్వేపరమైన సమస్యలు, అభివృద్ధి తదితర వాటిపై ప్రతిపాదనలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే భావనతో మంత్రి ఉన్నారు. ఏపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి రైల్వేమంత్రి సోమన్నను కలిసిన సందర్భంలో ఎంపీలతో సమావేశం అంశం వారిద్దరి మధ్య చర్చకు వచ్చింది. ఆగస్టు 19, 20వ తేదీలలో జోనల్ స్థాయిలో ఏపీ ఎంపీలతో ఒక సమావేశం నిర్వహించేందుకు యోచిస్తున్నట్లు సమాచారం.

▶▶ఎంపీలతో సమావేశాలు ఏవీ?

ప్రత్యేకంగా రైల్వేబడ్జెట్ ఉన్నప్పుడైనా సరే, ఇప్పుడు కేంద్రబడ్జెట్‌లో రైల్వేబడ్జెట్ విలీనమైన తర్వాత అయినా సరే ఆయా ఎంపీల నుంచి రైల్వేపరమైన ప్రతిపాదనలను దక్షిణమధ్యరైల్వే స్వీకరించేది. దక్షిణమధ్యరైల్వేలో ఉభయ తెలుగురాష్ట్రాలకు వేర్వేరుగా సమావేశాలకు ఎంపీలను ఆహ్వానించి, రైల్వే అభివృద్ధి, కొత్త రైలుమార్గం, ప్రయాణికులకు సౌకర్యాలు, కొత్త రైళ్లు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి తదితర అంశాలపై జీఎం నేతృత్వంలో ఎంపీలతో భేటీ సందర్భంగా ప్రస్తావించేవారు. తమ పరిధిలో ఉంటే పరిష్కరించడమో, లేకుంటే రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళ్లి సమాధానాలు ఎంపీలకు తెలిపేవారు. ఇదంతా ఒకప్పటి మాట..ఇప్పుడు ఆపరిస్థితులు కనిపించడంలేదన్న విమర్శలు ఎంపీల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కావలి కృష్ణతేజ

వేంపల్లె/చక్రాయపేట: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ప్రొటోకాల్ ఉల్లంఘించారని పాలక మండలి చైర్మన్ కావలి కృష్ణతేజ ఆరోపించారు. ఈ మేరకు గురువార జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. శ్రావణమాసం ఉత్సవాలకు సంబంధించి ప్రచారగోడ పత్రాల్లో, ఆహ్వానపత్రికల్లో దేవస్థానం పాలక మండలి చైర్మన్, సభ్యుల వివరాల ప్రస్తావన లేకపోవడం అవమానకరమని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత దశాబ్దాల కాలం నుంచి ఇంతవరకు ఇలాంటి తప్పు జరగలేదని తెలిపారు. గతంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలక మండలి చైర్మన్ తోపాటు సభ్యుల పేర్లను ఆహ్వాన పత్రికల్లో ముద్రించేవారని తెలిపారు. వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంటే అందుకు పాలక మండలి సభ్యులుగా బాధ్య త వహించాల్సి వస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో కేవలం గండి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ నిర్వహణలో జరుగుతున్నట్లు ఆహ్వాన, గోడ పత్రాల్లో ప్రచారం చేయడం శోచనీయమన్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ కమిషనర్‌ను వివరాలు అడుగగా సమాధానం చెప్పకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే వాల్ పోస్టర్లు పల్లెల్లో అంటించారని ఇప్పుడు విమర్శలు రావడంతో కంటితుడుపు చర్యల్లో భాగంగా ముఖ్యులకు ఇచ్చేందుకు తప్పులు సవరించి ఆహ్వాన పత్రికలు ముద్రించారని చెప్పారు.

8న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

మైదుకూరు: మైదుకూరులో ఈనెల 8న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ఈ ప్రదర్శన ఉంటుందని వారు పేర్కొన్నారు. మైదుకూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ ప్రదర్శనలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల నుంచి ఒక్కో ప్రాజెక్టును అనుమతిస్తామని తెలిపారు. ఎంపికైన ప్రాజెక్టులకు నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తామని వివరించారు. ఈనెల 5వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు మూర్తి వెంకటేశ్వర్లు 9848421002, వేపరాల వెనిజర్ ఇమ్మానుయేల్ 8328375357, కొప్పరపు గుణవర్ధన్ 9381441900 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

జిల్లా పంచాయతీరాజ్ అధికారి ధనలక్ష్మి



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

నిమ్మనపల్లె : గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని రాచవేటివారి పల్లె, రెడ్డివారిపల్లె పంచాయతీలలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిమ్మనపల్లెలోని డంపింగ్ యార్డు, (ఎస్‌డబ్ల్యూపీసీ) సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయాలన్నారు. ఎరువులు విక్రయించి సంపద సృష్టించాలన్నారు. ఎక్కడా కూడా అపరిశుభ్రతకు తావు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నిమ్మనపల్లి, వెంగళవారి కురవపల్లిలో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, ఈఓపీఆర్డీ చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవచ్‌తో రైళ్ల ఢీకి చెక్

- ముంబై-చెన్నై రైలు మార్గంలో కవచ్‌కు ప్రతిపాదన
- 523 కి.మీ. దూరం ఏర్పాటు
- నిర్మాణ వ్యయం రూ.90 కోట్లు



కవచ్

రాజంపేట: ప్రస్తుతం జరుగుతున్న రైలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని గుంతకల్-కడప-నందలూరు-రేణిగుంట మీదుగా ఉన్న రైల్వేలైనులో 'కవచ్' వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఈమేరకు సంబంధిత సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపార్టుమెంట్ (దక్షిణ మధ్య రైల్వే) నుంచి ప్రతిపాదన రైల్వే మంత్రిత్వ శాఖకు వెళ్లింది. ప్రధానంగా కవచ్ అనేది ఒకే లైనుపై రైళ్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఢీ కొనకుండా ముందస్తుగా ప్రమాదాన్ని పసిగట్టి నివారించే వ్యవస్థ కలిగి ఉంటుంది. అందువల్ల ఈ మార్గంలో రైళ్ల ఢీకి చెక్ పెట్టేందుకు కవచ్ వ్యవస్థను తీసుకు రానున్నారు. రైల్వే అధికారులు దశల వారీగా అన్ని జోన్‌లలో ఆయా సెక్షన్ల పరిధిలో ఈ టెక్నాలజీని తీసుకువస్తున్నారు. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్ నుంచి వాడి మార్గంలో ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు.

అనంతపురం, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో..

ప్రస్తుతానికి నాల్వార్-గుంతకల్-నందలూరు-రేణిగుంట (ముంబై-చెన్నై మార్గం)లో ఈ కవచ్ పద్ధతిని తీసుకురావడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రతిపాదనలు చేశారు. నాల్వార్ కర్ణాటక రాష్ట్రంలో ఉన్నప్పటికి, అధిక మొత్తం రాయలసీమ రైలు మార్గంలోనే కవచ్ ఉండనుంది. అనంతపురం , కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలో రైలు మార్గాన్ని కవచ్ వ్యవస్థకు ఎంపిక చేసే ప్రతిపాదనలకు త్వరలో రైల్వేబోర్డు ఆమోదం తెలపాల్సి ఉంది.

523 కి.మీ మేర రైలుమార్గానికి రూ.90 కోట్లు

దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన మేరకు 523 కిలోమీటర్ల మేర రైలుమార్గాన్ని కవచ్ సాంకేతిక వ్యవస్థ కిందకు తీసుకురానున్నారు. ఇందుకోసం నిర్మాణ వ్యయం రూ.90 కోట్ల మేర ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రైల్వే వర్గాల సమాచారం. ఈ వ్యవస్థ అమలైతే గుంతకల్-రేణిగుంట మార్గంలో రైళ్ల ఢీకి చెక్ పెట్టవచ్చని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.



గుత్తి-రేణిగుంట డబుల్‌లైన్

పింఛన్ల కోత.. పండుటాకుల వెత



- జిల్లాలో 1,123 మంది లబ్ధిదారులకు పింఛన్లు తొలగింపు
- దీనిపైనే ఆధారపడిన పేదలకు అన్యాయం
- జూలైలో జిల్లాలో లబ్ధిదారులు 2,23,436 మంది
- తాజా సంఖ్య 2,22,313
- రూ.44.92 లక్షలు మిగుల్చుకున్న ప్రభుత్వం

బి.కొత్తకోట: ఏ విషయంలోనైనా ఎదుగుదల కనిపిస్తుంది. కాని టీడీపీ ప్రభుత్వంలో ఎదుగుదల దేవుడెరుగు, పరిస్థితులు చూస్తుంటే ఉన్నది కూడా ఊడిపోయేలా ఉంది. పేదలు పొందే సామాజిక భద్రత పింఛన్లకు ఇది వర్తిస్తుంది. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల సంఖ్య పెద్దగానే ఉంది. గురువారం జిల్లాలో పంపిణీ చేసిన పింఛన్ల సంఖ్యను పరిశీలిస్తే గతనెల కంటే తగ్గిపోయింది. పెరగాల్సిన పింఛన్లు తగ్గిపోవడం, పేదల పొట్టకొట్టేలా ఉన్న ఈ వ్యవహారంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

1,123 మందికి కట్

జిల్లాలోని 30 మండలాలు, మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీ కలుపుని గత జూన్, జూలై నెలల్లో 2,23,436 మందికి సామాజిక భద్రత పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ నాటికి పరిస్థితులు మారిపోయాయి. నెల తేడాతో పేదలు సామాజిక భద్రత పింఛన్లను కోల్పోయారు. గురువారం పంపిణీ చేసిన పింఛన్ల జాబితాలో జిల్లాలో 1,123 మంది పింఛన్లకు కోత వేయడంతో తాజాగా 2,22,313 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కోత విధించిన కారణంగా సగటు పింఛన్ రూ.4వేలు అయినా రూ.44.92 లక్షల సొమ్ము ప్రభుత్వానికి మిగిలినట్టే.

అభద్రతాభావం

పేదలకు అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లు నిరుపేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. వృద్ధులు, మహిళలు దివ్యాంగులు, ఆర్థిక భరోసా ఉందని ధైర్యంగా జీవించేలా చేస్తోంది. ఈ పింఛన్ల పంపిణీలో కోత వేయడం ద్వారా వారిలో అభద్రతా భావం నెలకొంటోంది.

చనిపోయినవాళ్లే

జిల్లాలో పింఛన్లను తగ్గించలేదు. వృద్ధులు, ఇతర కారణాలతో చనిపోయిన వారి సంఖ్య వెయ్యికిపైగా ఉంటుంది. వారినే జాబితా నుంచి తొలగించాం. ఈ కారణాలు మినహాయిస్తే పింఛన్ల తగ్గింపు అనేది ఉండదు.

-సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ, రాయచోటి

జిల్లాలో తాజా పింఛన్లు

మండలం	పింఛన్లు
రామాపురం	5,127
లక్కిరెడ్డిపల్లె	4,660
నిమ్మనపల్లె	5,116
రామసముద్రం	6,508
కలికిరి	5,111
చిట్వేలి	5,718
రాజంపేట	7,622
ఓబులవారిపల్లె	6,461
రాయచోటి	4,713
రాజంపేట అర్బన్	3,276
టి.సుండుపల్లె	7,797
పెనగలూరు	5,169
సంబేపల్లి	5,716
వాయల్పాడు	6,886
ములకలచెరువు	6,729
గాలివీడు	7,177
వీరబల్లి	5,375
కురబలకోట	6,512
మదనపల్లె అర్బన్	11,064
చిన్నమండెం	5,151
రాయచోటి అర్బన్	8,433
కేవీపల్లె	6,968
కోడూరు	10,299
బి.కొత్తకోట	7,967
నందలూరు	4,109
తంబళ్లపల్లె	6,265
కలకడ	5,551
పెద్దతిప్పసముద్రం	8,006
గుర్రంకొండ	6,105
పెద్దమండ్యం	5,589
మదనపల్లె	14,203
పీలేరు	9,842

క్లుప్తంగా

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : తన భార్య రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు మండలం లోని వడ్డిపల్లికి చెందిన ముత్తన మహేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 30న వ్యవసాయపొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి రావడంతో తన భార్య కనబడకుండా పోయిందన్నారు. అప్పటినుంచి తాము పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పశుగ్రాసం దగ్ధం

కురబలకోట : మండలంలోని దిగువ చెన్నమర్రికి చెందిన కె.రాజగోపాల్‌రెడ్డి గడ్డి వామి గురువారం దగ్ధమైంది. విద్యుదాఘాతంతో వామికి నిప్పంటుకుంది. మంటలు రేగడంతో చింత చెట్లు కాలిపోయాయి. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. గత రెండేళ్లుగా విద్యుత్తు లైన్ మార్చాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

జేసీబీ సీజ్

పెనగలూరు : మండలంలోని కోమంతరాజుపురం వద్ద చెయ్యేరు నదిలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఈబీ సీఐ పవన్ కుమార్ తనిఖీ చేశారు. నదిలో ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న జేసీబీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

కొండాపురం : మండలంలోని రేగడిపల్లి–వంగనూరు మధ్య రైలు కిందపడి చామల రంగారెడ్డి (42) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. రైల్వే ఎస్ఐ వివరాల మేరకు.. కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన చామల రంగారెడ్డి బుధవారం బహిర్భూమికి వెళ్లి వస్తున్నారు. ఆ సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో ట్రాక్ ప్రక్కన పడి చనిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆ సీటు మాదే.. మీరు దిగిపోండి

పార్టీ మాదే.. ప్రభుత్వం మాదే.. మేము ఏమి చెప్పినా శిరసావహించాల్సిందే.. అంటూ అధికార పార్టీ నేతలు ఏకపక్ష వైఖరి అమలుచేస్తున్నారు. ఇప్పటికే సంక్షేమ కమిటీలకు వైకాపా ప్రభుత్వం నియమించిన నేతలచే రాజీనామా చేయించిన బాబు అనుచరులు ఇపుడు ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ స్థానం మాదే.. మీరు దిగిపోండి అంటూ పట్టుబట్టారు. చైర్మన్‌ను బెదిరించి ఒత్తిడి పెంచుతున్నారు.

- టౌన్ బ్యాంకు కమిటీపై టీడీపీ నేతల ఏకపక్ష వైఖరి
- రాజీనామా చేయాలంటూ చైర్మన్ కుమార్‌రెడ్డిపై ఒత్తిడి



ప్రొద్దుటూరులోని కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ కార్యాలయం

ప్రొద్దుటూరు : పదవీ కాలం ఉన్నా.. ముందుగానే రాజీనామా చేయాలంటూ అధికార పార్టీ నేతలు రుబాబు చేస్తున్నారు. తాజాగా ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ బ్యాంకు ప్రస్తుత చైర్మన్ యెల్లాల కుమార్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేశారు. గత 103 ఏళ్ల టౌన్ బ్యాంక్ చరిత్రలో ఈ పరిస్థితి ఎన్నడూ చోటుచేసుకోలేదు. గతంలో కాకర్ల లింగారెడ్డి ఎక్కువ సంవత్సరాలు బ్యాంకు చైర్మన్‌గా పనిచేయగా, ప్రస్తుతం నాలుగో మారు వరుసగా కుమార్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 32 ఏళ్ల పాటు బ్యాంకు డైరెక్టర్‌గా పని చేసిన ఈయన గత 17 ఏళ్లుగా చైర్మన్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. బ్యాంకుకు మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉండగా.. స్థానికంగా ఏ నాయకుడి అనుచరుడుగా ఉన్నా బ్యాంకులో రాజకీయాలకు తావు లేకుండా కుమార్ రెడ్డి పనిచేస్తున్నారు. ఖాతా దారుల్లో బ్యాంకుపై నమ్మకం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంది. అయితే అధికార పార్టీ నేతల ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తూ పదవీ కాలం ముగియకుండానే పదవీచ్యుతుడిని చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మూడేళ్ల కాల పరిమితి ఉండగానే...

ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్ పరిధిలో ఎర్రగుంట్ల, బద్వేలు, కడప బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. బ్యాంకుకు సంబంధించి కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. మొత్తం సుమారు 50 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం బ్యాంక్ చైర్మన్ పదవీకాలం ఐదేళ్లు. కుమార్‌రెడ్డి ఎన్నికై ఇప్పటికి రెండేళ్లు మాత్రమే పూర్తయింది. ఇంకా మూడేళ్ల పదవీకాలం ఉంది. అధికార పార్టీ ముఖ్య నేత, ఆయన వర్గీయులు మాత్రం తమ పార్టీవారే చైర్మన్‌గా కావాలని.. మీరు దిగిపోవాల్సిందేనని చైర్మన్ కుమార్‌రెడ్డిపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వాస్తవానికి మాజీ ఎమ్మెల్యేలు ఎంవీ.రమణారెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి వర్గీయులకు సంబంధించి పదిమంది డైరెక్టర్లు ఉండగా, నిన్నటివరకు అధికార పార్టీ తరపున ఇద్దరు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం మారడంతో కొంతమంది అధికార పార్టీకి అండగా నిలిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ప్రస్తుత చైర్మన్ కుమార్‌రెడ్డిచే రాజీనామా చేయించి కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారని బ్యాంకు వర్గాల్లో చర్చ సాగుతోంది. మితిమీరిన రాజకీయ జోక్యంతో బ్యాంకు పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశం ఉందని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

పింఛన్ రికార్డుల తనిఖీ


బియ్యం గోదాము పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో జరుగుతున్న పింఛన్ పంపిణీ ప్రక్రియను రాజంపేట డివిజన్ సబ్ కలెక్టర్ వైకోమ్ నిదియా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వే కోడూరు పట్టణంలోని రెండో వార్డులో పింఛన్ పంపిణీ తీరు పరిశీలించి సూచనలు చేశారు. పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం గోదామును తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌ను పేదలకు సక్రమంగా అందించాలని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేవీ.సుబ్రహ్మణ్యం, డీటీ.రెడ్డిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్డుదారుడికి నిత్యావసరాల పంపిణీ

– జేసీ ఆదర్శ రాజేంద్రన్


బియ్యం పంపిణీని తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

పీలేరు : జిల్లా వ్యాప్తంగా ప్రతి బియ్యం కార్డుదారుడికి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దే నిత్యావసర సరకులు అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. మండలంలోని పీలేరు పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో చౌక బియ్యం సరఫరాను గురువారం ఆమె తనిఖీ చేశారు. కార్డుదారులకు అందిస్తున్న ధరను అడిగి తెలుసుకొన్నారు. తూకాలలో తక్కువ వచ్చినా, అధిక మొత్తం తీసుకున్నా ఎండీయూ వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉదయం–సాయంత్రం గ్రామస్థులు అందుబాటులో ఉన్న సమయంలో సరకులు అందించాలని సూచించారు.

బంజరు భూమి కోసం వివాదం

చాపాడు : ప్రభుత్వ బంజరు భూమి కోసం ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. మండలంలోని వీరభద్రాపురం సమీపంలోని సర్వే నెంబర్ 311–ఎలో 1.10 ఎకరాల భూమి ఉంది. దీని పక్కనే 20 సెంట్ల ప్రభుత్వ బంజరు భూమి ఉంది. పట్టా భూమిని వీరభద్రాపురం గ్రామానికి చెందిన సురేంద్రనాథ్‌రెడ్డి నుంచి అదే గ్రామానికి చెందిన చంద్ర ఓబుళరెడ్డి కొనుగోలు చేశారు. ఈ పొలంలో గత కొన్నేళ్లుగా ఆయన వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇటీవల సురేంద్రనాథ్‌రెడ్డి, అయన బంధువులు వచ్చి 1.10 ఎకరాలకు మాత్రమే మీకు విక్రయించాము... మిగిలిన 20 సెంట్ల బంజరు భూమి నాది అంటూ షెడ్ వేసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వివాదం తలెత్తింది. ఇరు వర్గాల ఫిర్యాదులో గత నెల 23న తహసీల్దారు ఉమా రాణి ఆ స్థలానికి వచ్చి ప్రభుత్వ బంజరు భూమిగా గుర్తించి అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించారు. కాగా బుధవారం చంద్ర ఓబుళరెడ్డి తన పొలంలో వరి సాగు చేసేందుకు నారు పెట్టుకున్నారు. లక్ష్మీపేట, వీరభద్రాపురం గ్రామాలకు చెందిన బద్వేల్ సురేంద్రనాథ్‌రెడ్డి, బంధువులు కలిసి ట్రాక్టర్‌లో రాళ్లను తెచ్చి నారుమడిలో పడేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో చంద్ర ఓబుళరెడ్డి గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.


నారుమడిలో రాళ్లు వేస్తున్న వ్యక్తులు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

రాయచోటి టౌన్ : జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో గురువారం జరిగిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజంలోని సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే క్రమంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని విలేకరులు కోరగా సీఎం దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబాలను ఆదుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు తన నెల జీతం ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అన్నమయ్య జిల్లా ప్రింట్ మీడియా కమిటీలను రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా గొనిపల్లె శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వంశీధర్, కోశాధికారిగా రామచంద్ర, గౌరవాధ్యక్షుడిగా వెంకటకృష్ణయ్య, గౌరవ సలహాదారుడిగా రెడ్డెయ్యరాజులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఐక్య వేదిక నూతన కార్యవర్గ ఎంపిక గురువారం జరిగింది. స్థానిక ఎన్జీఓ సభా భవనంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరు శ్రీనివాసులును ఎంపిక చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా రమేష్‌బాబు, కార్యదర్శిగా కొండూరి రవిప్రకాష్‌రాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, అహమ్మద్‌బాషా, అస్లాం, జానకిరామ్, పెద్దపల్లె శేఖర్ ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఆదినారాయణ, మణికంఠ, ఆర్గనైజింగ్ సెక్రటరిగా బీటెక్ రవి, కోశాధికారిగా రెడ్డి ప్రసాద్, కార్యనిర్వాహక సభ్యులుగా పిడుగు మస్తాన్, రవీంద్రరాజు, సర్ఫరాజ్, సునీల్ ఎంపికయ్యారు.

పింఛన్ పంపిణీ పరిశీలన


ఎంఛన్ అందజేస్తున్న సీఈఓ రమణారెడ్డి

చిన్నమండెం : మండల కేంద్రంలో జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి గురువారం పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభించారు. సీఈవో రమణారెడ్డి చిన్నమండెం, మల్లూరు గ్రామాల్లో పింఛన్ పంపిణీ చేసి తనిఖీ చేశారు. దాదాపు 96 శాతం పూర్తిచేశామని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

సెల్ టవర్ వద్ద గుర్తు తెలియని మృతదేహం



పుల్లంపేట : మండలంలోని అనంతయ్యగారిపల్లిలోని సెల్ టవర్ వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి 35 సంవత్సరాల వయస్సు ఉందని, బ్లూ కలర్ నైట్ ప్యాంట్, నలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. బంధువులు, స్నేహితులు మృత దేహాన్ని గుర్తించినచో 9121100572, రాజంపేట రూరల్ సీఐ, 9121100574, పుల్లంపేట ఎస్ఐ నెంబర్లను సంప్రదించాలని పుల్లంపేట పోలీసులు తెలిపారు.

బాకీ తీర్చలేదని నేతన్నపై దాడి


గాయపడిన నాగేంద్ర

మదనపల్లె : బాకీ తీర్చలేదని నేతన్నపై మగ్గాల యజమాని దాడికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బయారెడ్డి కాలనీలో నాగేంద్ర(46).. నీరుగట్టుపల్లెకు చెందిన మగ్గాల యజమాని రాజారెడ్డి దగ్గర చేనేత కార్మికుడిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి అవసరాల కోసం నాగేంద్ర కొంత నగదును యజమాని వద్ద అప్పుగా తీసుకున్నారు. కొంతకాలంగా బాకీ చెల్లించకపోగా, మరో చోట పనులకు వెళ్లాడు. దీంతో బుధవారం రాత్రి నీరుగట్టుపల్లెలోని రింగు రోడ్డు వద్ద ఉన్న నాగేంద్రను కలిసి బాకీ చెల్లించాలి.. లేదా పనిచేయాలంటూ వివాదానికి దిగారు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో రాజారెడ్డి, తన కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రపై దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మర్రిబండలో చిరుత కలకలం..!


అడవి జంతువు దాడిలో గాయపడిన మేకపోతు


ఆనవాళ్ల కోసం వెతుకుతున్న అటవీ అధికారులు

లేగ దూడ, మేకపై దాడి చేసిందంటున్న రైతు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ మర్రిబండ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు తెలిపిన మేరకు వివరాల మేరకు.. మర్రిబండ గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద శ్రీరాములు వరి పంట సాగు చేశాడు. దీంతోపాటు కోళ్లు, మేకలు, పశువులు పెంచుతున్నాడు. తెల్లవారుజామున కుక్క అరవడంతో శ్రీరాములు బయటకు వెళ్లి చూశారు. ఓ లేగ దూడ, మేకపోతుపై క్రూర జంతువు దాడి చేసిందని, కుక్క అరవడంతో వెనుదిరిగిందని గుర్తించారు. చిరుత దాడి చేసి ఉంటుందని భావించి శ్రీరాములు రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. వాల్మీకిపురం అటవీ సెక్షన్ అధికారి సుధాకర్, నూరుకుప్పలకొండ బీట్ ఆఫీసర్ శోభారాణి, సిబ్బంది చేరుకొని జంతువు ఆనవాళ్ల కోసం వెతికారు. చిరుత దాడి చేసినట్లు ఆనవాళ్లు లేవని, తోడేలు లేక హైనా దాడిచేసి ఉండవచ్చని అధికారులు తెలిపారు. పశువులను, మేకలను రాత్రి వేళల్లో ఉంచవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో, ఏబీఓ హరిశంకర్‌రెడ్డి, ఏఎస్ఐ జిలానీ బాషా, వీఆర్వో నాగేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం చేసిన సబ్ కలెక్టర్

కలికిరి : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలె వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ గురువారం మధ్యాహ్న భోజనం చేశారు. కలికిరి పంచాయతీ పరిధిలోని కలికిరి-1, కలికిరి-2, కలికిరి-3, కలికిరి-4, మర్రికుంటపల్లిలో ఉదయం జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పలువురు వృద్ధులు, వికలాంగులకు నగదు అందజేసిన ఆయన వారితో మాట్లాడారు. ఫించనుదారులకు ఇబ్బంది కలుగకుండా ఇంటి వద్దే నగదు అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడి విద్యా విధానం, డిజిటల్ విద్యా బోధన, వసతి, మెనూ అమలు తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రార్థన చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.


గురుకుల పాఠశాలలో సహపంక్తి భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న సబ్ కలెక్టర్, విద్యార్థినులు

రికార్డులు భద్రంగా ఉంచాలి

కలికిరి మండల తహసీల్దారు కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, కార్యాలయంలో ప్రైవేటు సిబ్బందిని నియమించుకోరాదని సూచించారు. ప్రతి కార్యాలయ పని వేళల అనంతరం వాచ్‌మెన్‌గా వీఆర్ఏను ఏర్పాటుచేసుకోవాలన్నారు. అదనపు వేళలు పని చేయాల్సి వస్తే రావడానికి తప్పనిసరిగా తహశీల్దారు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ సయ్యద్‌అహ్మద్, సిబ్బంది దేవి, హుస్సేన్ పీరన్, పుష్పలత, వీఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

8 నుంచి ఒంటిమిట్ట గర్భాలయం మూసివేత

ఒంటిమిట్ట : కోదండ రామాలయంలోని మూల విరాట్ సీతారామ లక్ష్మణుల గర్భాలయాన్ని సెప్టెంబర్ 8వ తేదీ నుంచి రెండు నెలలపాటు మూసి వేస్తున్నట్లు టీటీడీ ఆగమ అర్చకులు రాజేష్ బట్టర్ తెలిపారు. సెప్టెంబర్ 6న అంకురార్పణతో స్వామికి బాలాయనం కైంకర్యాలు వేదపండితులు నిర్వహించి మూలవిరాట్‌లోని శక్తి సామర్థ్యాలను ఉత్సవ విగ్రహాల్లోకి అనువదించడం శాస్త్రీయంగా చేపడతారు. పురావస్తు ఆధ్యాత్మిక వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకు పురావస్తు శాఖ, టీటీడీ ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయానికి భక్తులందరూ సహకరించాలని కోరారు.

మరమ్మతులకు అనుమతులు మంజూరు

ఆంధ్ర అయోధ్యంగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయ విమాన గోపురానికి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. పురావస్తుశాఖ రాష్ట్ర అధికారి బాలకృష్ణా రెడ్డి, టీటీడీ ఇంజినీరింగ్ ఈఈ సుమతి, స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆలయంలో చేపట్టాల్సిన పనులను క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. అనంతరం టీటీడీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయంలో భావితరాలకు ఉపయోగపడే విధంగా విమాన గోపురానికి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.


రామాలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు